




చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్, నగర మేయర్

పోలియోను సమూలంగా పారదోలదాం

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

పోలియో మహమ్మారిని సమూలంగా పారదోలదామని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బోయగిరిజమ్మ పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలోని కోర్ట్ రోడ్ లో ఉన్న నెహ్రూ మున్సిపల్ స్కూల్లో ఆదివారం పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని జెడ్పీ ఛైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఛైర్‌పర్సన్‌తో పాటు నగరపాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మాట్లాడుతూ చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో అవసరం అన్నారు. 0-5 ఏళ్ల మధ్యనున్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆరోగ్య శ్రీ కింద వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. నగరపాలక సంస్థ మేయర్ వసీం మాట్లాడుతూ పోలియోను సమూలంగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. పిల్లలందరికీ ఖచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈరోజు పోలియో చుక్కలు వేయించుకోని వారు సోమ, మంగళ వారాల్లో పోలియో చుక్కలు వేయించుకోవాలన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి మాట్లాడుతూ పోలియోను సమూలంగా పారద్రోలడానికి 0-5 ఏళ్ల మధ్యనున్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐఒ యుగంధర్, మెడికల్ ఆఫీసర్ గంగాధర్ రెడ్డి, డెమో ఉమాపతి, డిప్యూటీ డెమోలు గంగాధర్, త్యాగరాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హనీఫ్ జావేద్, వైద్య సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు 'రా.. కదలిరా...'



◆ పెనుకొండలో చంద్రబాబు పర్యటన ◆ సభ ఏర్పాట్లలో నాయకులు

◆ విజయవంతానికి జనసమీకరణ ◆ అసంతృప్త నేతలను గాడిలో పెట్టేరా., ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చేపట్టిన 'రా కదలిరా' కార్యక్రమం నేటితో ముగియనుంది. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో జరిగే ఈ సభకు ఆ పార్టీ శ్రేణులు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నాయి. ముందుగా రాప్తాడు నియోజకవర్గంలో ఈ సభను ఏర్పాటు చేయాలనుకున్నప్పటికీ చివరి నిమిషంలో మార్పు చేశారు. ప్రస్తుతం పెనుకొండలో ఏర్పాటు చేశారు. రా కదలిరా సభ అంతకు మునుపు అనంతపురం జిల్లా ఉరవకొండలో ఏర్పాటు చేశారు. ఆశించినంత మేరకు జన సేకరణ చేపట్టి సభను విజయవంతం చేశారు. ఇదే నేపథ్యంలో వైసిపి ఫిబ్రవరి 18వ తేదీన సిద్ధం సభను రాప్తాడులో ఏర్పాటు చేసింది. రాయలసీమస్థాయి సభకు లక్షలాది మంది జనసమీకరణ చేపట్టి బలప్రదర్శన చేసింది. ఈ సభ జరిగిన చోటనే రాప్తాడులో రా కదలిరా సభను నిర్వహించాలని మొదట టిడిపి భావించింది. అయితే చివరి నిమిషంలో మార్పు చేసి పెనుకొండకు మార్చింది. కియా సమీపంలో ఈ సభకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు చంద్రబాబునాయుడు పెనుకొండకు రానున్నారు. సాయంత్రం ఐదున్నర గంటలకు సభ పూర్తవనుంది. ఈ సభను విజయవంతం చేయడానికి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి జనసమీకరణ చేపట్టే ఏర్పాట్లలో పార్టీ నేతలున్నారు. ఈ సభతో రా కదలిరా కార్యక్రమాన్ని ముగించి ప్రజాగళం పేరుతోకార్యక్రమాలను రూపొందించేందుకు పార్టీ సిద్ధమైంది. ఆఖరు సభ కాబట్టి పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని టిడిపి భావిస్తోంది.

అసంతృప్తులను గాడిలో పెట్టేరా ?

టిడిపి జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు ఈ పర్యటన సందర్భంగానైనా అసంతృప్తులను గాడిలో పెడతారా అన్న చర్చ నడుస్తోంది. ఇటీవలనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ తొమ్మిది నియోజకవర్గాల్లో అభ్యర్థులను టిడిపి ఖరారు చేసింది. ఇందులో అనేక చోట్ల అసంతృప్తులున్నాయి. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు పర్యటించే పెనుకొండలోనే సత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి వర్గీయులు అసంతృప్తితో ఉన్నారు. ఆయనకు కాకుండా సవితకు టిక్కెట్టు ఇచ్చారని ఒక గ్రూపు అలకబూనింది. అదే విధంగా కళ్యాణదుర్గం, శింగనమల, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనూ అసంతృప్తులున్నాయి. ఈనేపథ్యంలో ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో చంద్రబాబు వీటన్నింటిపై నేతలతో చర్చిస్తారా లేక కార్యక్రమం ఒక్కటికే పరిమితమవుతారా అన్న చర్చ నడుస్తోంది. అభ్యర్థుల ప్రకటన వెలువడిన వెంటనే అసంతృప్త నేతలతో ఆయన మాట్లాడినట్టు తెలుస్తోంది. అయితే ఎన్నికల్లో వీరి ఏ మేరకు సహకరిస్తారన్న సందేహాలు మాత్రం అభ్యర్థుల్లోనూ ఉన్నాయి. అదే విధంగా ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీ శ్రేణులకు ఏ రకంగా మార్గనిర్దేశం చేస్తారోనని ఆపార్టీ నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపికి కంచుకోట లాంటిది. అటువంటిది గత ఎన్నికల్లో ఘోరంగా పరాయజయాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో తిరిగి పార్టీ పుంజుకోవడానికి ఎటువంటి మార్గదర్శకాన్ని సూచిస్తారోనని ఆ పార్టీ నేతలు ఎదురు చూస్తున్నారు.



సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సవితమ్మ, టిడిపి నాయకులు

కూలీల ఆటో బోల్తా..

12 మందికి గాయాలు-ఇద్దరి పరిస్థితి విషమం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

ఉరవకొండ : విడపనకల్లు మండలం ఉండబండ గ్రామం వద్ద వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఉరవకొండ మండలం బూదగవి గ్రామానికి చెందిన మహిళ కూలీలు పాల్తూరులో మిర్చి పొలంలో పనిచేయడానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా సరిగ్గా ఉండబండ వద్దకు రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో మొత్తం 12 మంది మహిళలకు గాయాలయ్యాయి.అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.ప్రమాద సమయంలో ఆటోలో 20 మంది ప్రయాణిస్తున్నట్టు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సాహిత్యంతో నీటి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళదాం

సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్
పెనుకొండలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జలకవనం



సమావేశంలో మాట్లాడుతున్న సడ్లపల్లి చిదంబరరెడ్డి

ప్రజాశక్తి -పెనుకొండ

రాయలసీమ జిల్లాలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను సాహిత్యం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళదామని సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ పిలుపునిచ్చారు. పెనుకొండ పట్టణంలోని గగన్ మహల్ ఆవరణంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం జలకవనం నిర్వహించారు. సాహితీస్రవంతి జిల్లా కన్వీనర్ ఏ. హరి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయలసీమ జలసాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశ రథ రామిరెడ్డి, సాహితీ స్రవంతి రాష్ట్ర ఆధ్యక్షులు కెంగార మోహన్, ఏలూరి యంగన్న, సడ్లపల్లి చిదంబర రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో దశాబ్దాలుగా నీటి సమస్య ఉందన్నారు. వర్షపాతం తక్కువగా ఉన్న ఈ జిల్లాల్లో నీటి సమస్యల పరిష్కారంలో పాలకులలో చిత్తశుద్ధి లేకపోవడంతో సమస్య జఠిలమైందన్నారు. ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయకపోవడం, వర్షపు నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం లేకపోవడం వలన నీటి ఎద్దడి రోజు రోజుకు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జలకవనంలో జరిగే సాహిత్యం ద్వారా నీటి సమస్యలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వాల కళ్లు తెరిచే విధంగా కవితలు, పద్యాలు, పాటలు ఉండాలన్నారు. కవులు, రచయితల పాటలు, పద్యాలు, కవితలు రాయలసీమ ఎదుర్కొంటున్న నీటి కరువు గురించి కారణాలు ఏమిటో ప్రతిబింబించాలన్నారు. రాయలసీమకు అడుగుతున్న నీటి హక్కులు ప్రాంతీయ తత్వం కాదన్నారు. రాయలసీమ నీటి సంక్షోభం సాహిత్య ప్రభావాన్ని గురించి సడ్లపల్లి, మోహన్ ఈసందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమం లో రాయలసీమ జిల్లాలనుంచి వచ్చిన కవులు, గాయకులు తమ కవితలను, పద్యాలను, పాటలను వినిపించారు. అనంతరం నిర్వాహకులు కవులకు, గాయకులకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి కవులు, కళాకారులు, సాహితీ స్రవంతి సభ్యులు రాజశేఖర్, కోగిర జయచంద్ర, రామన్న, యుటిఎఫ్ నాయకులు సుధాకర్, నారాయణ స్వామి, రమేష్, మేధావులు, ప్రముఖులు పాల్గొన్నారు.

అప్పేచెర్ల, కుందనకోటలో విషాదఛాయలు

తమిళనాడులో గల్లంతైన విద్యార్థుల మృతదేహాలు లభ్యం



విద్యార్థి మృతదేహం

పెద్దవడుగూరు : మండలంలోని అప్పేచెర్లతోపాటు యాడికి మండలం కుందనకోటలో విషాదఛాయలు అలుముకున్నాయి. విహారయాత్రకు వెళ్లి తమిళనాడులోని మహాబలేశ్వరం వద్ద సముద్రంలో స్నానానికి వెళ్లి ఇద్దరు విద్యార్థులు గల్లంతైన విషయం తెలిసిందే. గల్లంతైన అప్పేచెర్లకు చెందిన చిక్కెం శేషారెడ్డి (21), యాడికి మండలం కుందనకోటకు చెందిన పెద్దిరాజు (22) మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. విహార యాత్రకు వెళ్లిన కుమారులు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. 'సరదాగా విహార యాత్రకు వెళ్లిన మా బిడ్డలు ఇక లేరంటా' అంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు చేస్తున్న రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టిస్తున్నాయి.

ఒత్తిడి లేకుండా చదువుకోవాలి

సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదనరావు

ప్రజాశక్తి-అనంతపురంసిటీ

త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా చదువుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూధన్‌రావు సూచించారు. ఆదివారం నగరంలోని ఎస్సీ నెం:4 హాస్టల్లో పదో తరగతి విద్యార్థులకు (ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు) ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయన్నారు. ఈనేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా చదువుకోవాలన్నారు. ముఖ్యంగా కడుపు నిండా అన్నం తినాలని, 7 నుంచి 8 గంటలు నిద్ర పోవాలన్నారు. జీవితంలో ముందుకెళ్లడానికి పదో తరగతి మొదటి మెట్టు అన్నారు. కావున మంచి మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలన్నారు. తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా చదువుకోవాలన్నారు. ఇకపోతే హాస్టల్లోని పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలన్న పట్టుదల వార్డెన్లలో కూడా ఉండాలన్నారు. మిగతా డివిజన్ కేంద్రాల్లోని హాస్టళ్లలోని పదో తరగతి విద్యార్థులకు కూడా శిక్షణ తరగతులు నిర్వహించాలని, దూర ప్రాంతాల్లోని హాస్టళ్లలో అక్కడే శిక్షణా తరగతులు నిర్వహించాలని ఎఎస్‌డబ్ల్యుఒలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, కళ్యాణదుర్గం ఎఎస్‌డబ్ల్యుఒ దామోదర్‌రెడ్డి, వారెన్లు లక్ష్మీనారాయణ, శారద, అనిత, నాగార్జునరెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మదుసూధన్‌రావు

రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కాన్సర్ వైద్యశిబిరాలు

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

బసవతారక ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కాన్సర్ మొబైల్ వైద్యశిబిరాలు నిర్వహిస్తామని స్థానిక ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. హిందూపురంలోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని బాలకృష్ణ ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి మరణాంతరం ఆమె జ్ఞాపకార్థకంగా బసవతారక ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ను తన తండ్రి నందమూరి తారక రామారావు స్థాపించారన్నారు. తన తండ్రి స్ఫూర్తితో క్యాన్సర్ హాస్పిటల్ నిర్వహిస్తు, ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నామని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక పరికరాలతో కూడిన మొబైల్ వాహనాన్ని తయారు చేయడం జరిగిందన్నారు. నూతన ఉచిత మొబైల్ క్యాన్సర్ నిర్ధారణ వాహనాన్ని హిందూపురం నుంచే ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పేదవారికి తమ ఆసుపత్రిలో ఉచిత సేవలు అందించడంతో పాటు రాయితీతో కూడిన వైద్య సేవలందిస్తామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు ముందుకు వస్తే రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే హిందూపురం నియోజక వర్గంలో గత సంవత్సరం నుండి ఎన్టీఆర్ మొబైల్ చైతన్య రథం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తున్నామన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య రథం నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి వైద్య సేవలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ అసుపత్రి వైద్యులు సుధాకర్, శ్రావణి కుమారి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్. సురేంద్ర, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, అంబికా లక్ష్మినారాయణ, రమేష్ కుమార్ తో పాటు టిడిపి నాయకులు, వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టు సిబ్బందికి అవగాహన



మాట్లాడుతున్న సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ

అనంతపురం క్రైం : ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాలతో సరిహద్దు చెక్‌పోస్టుల సిబ్బందికి ఆదివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఆంధ్ర-కర్నాటక సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా కొనసాగించాలన్నారు. కర్నాటక నుంచి జిల్లాలోకి ఎలాంటి అక్రమ మద్యం, మత్తు పదార్థాలు, ఆయుధాలు, డబ్బు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏవేని సీజ్ చేసిన సందర్భాల్లో పాటించాల్సిన నియమ, నిబంధనలు, విధివిధానాల గురించి వివరించారు. ఈసమావేశంలో ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజ, ఏఈఎస్ శ్రీరాం, చెక్‌పోస్టుల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతిగృహాలకు మహర్దశ

సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివరంగప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లాలో ఉన్న 26 సాంఘిక సంక్షేమ హాస్టళ్ల రూపు రేఖలు మారనున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివ రంగ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తికి ఆదివారం ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను నాడు నేడు కింద ఏ విధంగా అభివద్ధి చేశారో అదేవిధంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్ల రూపురేఖలను మార్చుమన్నారని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఇంటర్నెట్, టీవీ సౌకర్యాలు తదితర అంశాలను చర్చించి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

ప్రశ్న :శ్రీ సత్య సాయి జిల్లాలో ఎన్ని హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఎన్ని?

జవాబు: శ్రీ సత్యసాయి జిల్లావ్యాప్తంగా 26 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో మూడు నుండి పదవ తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన హాస్టల్లో బాలురకు 12, బాలికలకు 5 ఉన్నాయి. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఇంటర్మీడియట్ చదివే బాలికలకు 5, బాలురకు 4 ఉన్నాయి.

ప్ర: విద్యార్థులకు కాస్మటిక్ చార్జీలు సరిగా అందజేస్తున్నారా.?

జ: గతంలో మాదిరి కాకుండా విద్యార్థులకు నెలనెలా ఇవ్వాల్సిన కాస్మోటిక్ ఛార్జీలను వారి తల్లుల ఖాతాలో జమ చేస్తున్నాం. మెస్ చార్జీల విషయానికి వస్తే గతంలో ఉన్న చార్జీలు ఇప్పుడు అమలవుతున్నాయి వాటి వల్ల ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనం అందించలేక ఇబ్బందులు పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లాం.



ప్ర : హాస్టల్ సిబ్బందికి బయోమెట్రిక్ విధానం అమలులో ఉందా.?

జ : హాస్టల్ సిబ్బంది బయోమెట్రిక్ విధానాన్ని అవలంభిస్తున్నారు. దాని ద్వారా ఏ అధికారి విధులు హాజరు కాలేదో వెంటనే ఉన్నతాధికారి దృష్టికి వెళ్తుంది. ఈ తరుణంలో సిబ్బంది హాజరు పై సంజాయిషీ ఇవ్వాల్సి వస్తుంది ఈ విధానంతో సిబ్బంది వందశాతం విధులకు హాజరవుతున్నారు.

ప్ర : అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు ఎప్పుడు మంజూరు చేస్తారు?

జ : సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పరిధిలో రెండు రకాల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మూడు నుండి పదవ తరగతి వరకు ఉన్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఆప్కార్డు నుండి నెల నెల వేతనాలు అందుతున్నాయి. జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి మదర్‌థెరిస్సా ట్రస్టు నుండి వేతనాలు అందాల్సి ఉంది ప్రభుత్వం గ్రాంటు మంజూరు చేస్తే మదర్‌థెరిస్సా ట్రస్టు బదలాయింపు చేసి వారికి వేతనాలు మంజూరు చేస్తారు.

ప్ర : హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏవి.?

జ : హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతోంది ప్రధానంగా అద్దె భవనాల్లో ఉన్న వసతి గృహాలపై దృష్టి పెట్టింది. వాటికి నాడు నేడు పథకం కింద శాశ్వత భవనాలను నిర్మించి హాస్టలను ఉత్తమ స్థాయిలో తీర్చిదిద్దాలని తృకృథంతో ప్రభుత్వం ఉంది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సౌకర్యంతమైన ఆశ్రయం ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందించడానికి అన్ని చర్యలు చేపడుతుంది.



హాస్టళ్ల పని తీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణతో విద్యార్థుల హాజరు, వారికి నాణ్యమైన భోజనం అందుతుందా లేదా అనే అంశాలను వారు పరిశీలించి అప్పటికప్పుడు తీసుకురావడంతో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం.

ప్రజాశక్తి
www.prajasakti.com



బుక్కరాయసముద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీ సీఈవో వైభోమ్ నిదియాదేవి, బొమ్మనహాల్, ఉరవకొండ మండలాల్లో చుక్కలు వేస్తున్న వైద్యసిబ్బంది

రెండు చుక్కలతో అంగవైకల్యం దూరం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలోని చెదుళ్లలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కార్యక్రమాన్ని జెడ్పీ సీఈఓ వైభోమ్ నిదియాదేవి ప్రారంభించారు. అలాగే బుక్కరాయసముద్రం ఎంపిడిఓ స్కూల్ దగ్గర మండల ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ దాసరి సునీత, ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ సెంటర్‌లో సర్పంచి పార్వతి, గాంధీనగర్ అంగన్వాడీలో సెంటర్‌లో ఆసుపత్రి కమిటీ సభ్యులు మస్తోర కొండమ్మ చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతోపాటు సెంట్రల్ యూనివర్సిటీలో నూతన బిల్డింగ్ నిర్మాణం కోసం వచ్చిన కార్మికుల పిల్లలకు వైద్యాధికారి డాక్టర్ స్వాతి లక్ష్మీ ఆధ్వర్యంలో చుక్కలు వేశారు.

బొమ్మనహాల్ : మండలవ్యాప్తంగా చిన్నారులకు వైద్యసిబ్బంది పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రంతోపాటు శ్రీధరగట్ట, దర్గాహొన్నూరు తదితర గ్రామాల్లోని ఆసుపత్రుల్లో పోలియో చుక్కలు వేశారు. మండలవ్యాప్తంగా 98శాతం పోలియో చుక్కలు వేసినట్లు వైద్యులు శ్రీలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, శ్రీధర్‌గట్ట, దర్గా హొన్నూర్ గ్రామాల వైద్యులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : ఐదేళ్లలోపు చిన్నారులకు రెండు చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దామని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కళ్యాణం హైస్కూల్, ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళు శిల్ప, నాయకులు దివాకర్, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండల కేంద్రంలోని పామిడమ్మ వీధిలో ఉన్న పోలియో కేంద్రం వద్ద చిన్నారులకర పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా 4వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి ఈశ్వర్‌రెడ్డి, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరి మాట్లాడుతూ పోలియో మహమ్మారిని తరిమికొట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు ఎస్సీ సెల్ సీనా, సోషల్ మీడియా కో-కన్వీనర్ పుల్లా

పల్స్ పోలియో కార్యక్రమంలో వక్తలు

సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎద్దులపల్లి ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 47 కేంద్రాల్లో 6,174 మంది చిన్నారులకుగాను 5966 మందికి చుక్కలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలవ్యాప్తంగా ఆదివారం ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కార్యక్రమంలో 98శాతం పూర్తి చేసినట్లు వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. మండల వ్యాప్తంగా 2410 మంది పిల్లలు ఉండగా 2362 మందికి చుక్కలు వేశామన్నారు. నేడు, రేపు కూడా చుక్కలు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

ఉరవకొండ : పోలియో రహిత సమాజం నిర్మించడమే ప్రభుత్వ ధ్యేయమని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షులు దండిన శివానంద అన్నారు. ఆదివారం ఉరవకొండ, విడపనకల్ మండలవ్యాప్తంగా ఉన్న పీహెచ్సీల పరిధిలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో చుక్కలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా లెప్రసీ అధికారి అనుపమ జేమ్స్, వైద్యాధికారులు అరుణకుమారి, శివశంకరనాయక్, నాయకులు కరణం భీమిరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ రమేష్, ఎంపిహెచ్ఒ తిరుపాల్, సూపర్‌వైజర్ కుతుబుద్దీన్, నాగమ్మ, త్యాగరాజు, గడేకల్ సిహెచ్ఓ షేక్‌ఫర్హాజన్, రామకృష్ణ, ఏఎన్ఎంలు శ్రావణి, సుగుణ, సర్పంచులు సుశీల ఉమాశంకర్, భ్యూలారాణి రాజశేఖర్, ఎంపిటిసి ఓబులేష్, శివ, వెంకటేసులు, నాయకులు నల్ల సుంకన్న, డిష్.వెంకటేసులు, వైద్యసిబ్బంది ఆశా, అంగన్వాడీలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండలవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమంలో 97శాతం చిన్నారులకు చుక్కలు వేసినట్లు డాక్టర్ కార్తీక్ కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఎంపిడిఓ సుబ్బరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 4792 మంది చిన్నారులు ఉండగా 97 శాతం చుక్కలు వేసినట్లు తెలిపారు. రెండు రోజుల్లో వందశాతం చుక్కలు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, సూపర్‌వైజర్ వెంకటరమణ, ఏఎన్ఎంలు విజయకుమార్, వసంత, రాధమ్మ, అంగన్వాడీలు, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలో వైసిపి నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, మండల కన్వీనర్ నాగేశ్వరరావు, సర్పంచి సుప్రియ, సిద్ధరాచర్లలో సర్పంచి రామాంజనేయులు, శౌనకపల్లిలో ఎంపిటిసి కాటమయ్య, గూగూడులో ఎంపిటిసి రాజారెడ్డి, బండ్లపల్లిలో ఎంపిటిసి శంకర్‌యాదవ్, పప్పూరులో ఎంపిటిసి పద్మాకర్‌రెడ్డి పోలియో చుక్కలు వేసే కార్యక్రమాలను ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 97.66 శాతం పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు మండల ప్రాథమిక వైద్యులు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా 3828 మంది చిన్నారులు ఉండగా ఇందులో 3717 మందికి చుక్కలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి గవ్వల శ్రీరాములు, వైసీపీ నాయకులు జానుగాని శివశంకర్, సుంకలమ్మ, శివ, వేదంతా మోహన్, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : మండలవ్యాప్తంగా ఆదివారం పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ రమేష్ తెలిపారు. ఇందులో భాగంగా గుమ్మఘట్ట, 75 వీరాపురం, పూలకుంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను విజయవాడ నోడల్ ఆఫీసర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుజాత పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 5778 మంది పిల్లలు ఉండగా 5609 మందికి చుక్కలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి మహమ్మద్ రఫీ, డాక్టర్ సందేశ్, డాక్టర్ బాలాజీనాయక్, మురళీధర్, ఆసుపత్రి సిబ్బంది, నర్సులు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సిఎంను చేసుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పామిడి

అందరం కష్టపడి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును సిఎంను చేసుకుందామని టిడిపి పట్టణ క్లస్టర్ ఇన్‌ఛార్జి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణరెడ్డి స్వగృహంలో పట్టణ బూత్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, టిడిపి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ 6 సంక్షేమ పథకాలను పట్టణ ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా క్యాలెండర్ అందజేయాలన్నారు. అనంతరం టెలిగ్రామ్ బాట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గౌస్‌పీరా, టౌన్ కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కార్యదర్శి శివ, కృష్ణమోహన్, గాది లింగప్ప గౌడ్, తేల్‌బాషా, కరూరు శివ, జాఫర్, రామాంజి, చిరంజీవి, మస్తాన్, దూద్‌పీరా, సూరీ, సుంకిరెడ్డి, చీమల రాము, వన్నూర్, పత్రా శీను, రాజన్న, ఎర్రగుడి జిలాన్, ఓబులేసు, జనసేన ధనుంజయ, టిడిపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భర్త, అత్త నుంచి రక్షణ కల్పించండి..

బాధిత మహిళ వేడుకోలు

ప్రజాశక్తి-గుత్తి

భర్త షాషావలి, అత్త నుంచి తనకు, తన తల్లిదండ్రులు, సోదరులకు రక్షణ కల్పించాలని షాకీరా కోరింది. ఈమేరకు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ తాను ఇంజనీరింగ్ పూర్తి చేసి హైదరాబాదులోని ఓ ప్రయివేట్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నానన్నారు. ఈనేపథ్యంలో కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చిన్న జొన్నగిరికి చెందిన షాషావలిని ప్రేమించి ఇరువర్గాల పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నామన్నారు. వివాహ సమయంలో తమ తల్లిదండ్రులు వరుడు షాషావలికి రూ.12 లక్షల నగదు, 11 తులాల బంగారు ఆభరణాలు ఇచ్చారన్నారు. దాదాపు రూ.8 లక్షలు ఖర్చు చేసి పెళ్లి చేశారని చెప్పారు. కొంతకాలం గుత్తి ఆర్ఎస్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని కాపురం ఉండేవారని, అయితే షాకీరా ఉద్యోగరీత్యా దంపతులు హైదరాబాదుకు వెళ్లామన్నారు. షాకీరా నెలవారి వేతనం రూ.60వేలు మొత్తం భర్త షాషావలి అకౌంట్ లోకి ట్రాన్స్‌ఫర్ చేసుకుని విచ్చలవిడిగా ఖర్చు చేసేవాడని వాపోయింది. ఇంకా డబ్బు కావాలని వేధించేవాడన్నారు. దీనికితోడు తన వద్ద లేకుండా తల్లి వద్దకు చేరుకుని అదనపు కట్నం కోసం మానసికంగా వేధించే వాడని ఆందోళన వ్యక్తం చేసింది. ఇందులో భాగంగానే భర్త, అత్త తనతోపాటు కుటుంబ సభ్యులపై భౌతిక దాడికి పాల్పడేవారన్నారు. ఈ బాధలు తట్టుకోలేక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే భర్తను పిలిపించి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారన్నారు. అయినా మార్పు రాలేదన్నారు. అంతేగాకుండా తనతోపాటు తన కుటుంబ సభ్యులను చంపుతామని బెదిరిస్తున్నారనానరు. కావున భర్త, అత్తలు నుంచి తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరింది.

'రా.. కదలి రా..'ను జయప్రదం చేయండి

శింగనమల అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ



చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

పెనుగొండ నియోజకవర్గం కియా పరిశ్రమ ఎదురుగా సోమవారం చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్న రా..కదిలి..రా సభలను విజయవంతం చేయాలని శింగనమల టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. ఆదివారం పెనుకొండ మండలం కియా పరిశ్రమ వద్ద చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను జిల్లా టిడిపి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రా...కదిలి...రా సభలో టిడిపి అధినేత చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను వివరించనున్నట్లు తెలిపారు. నియోజవర్గంలోని రాష్ట్ర టిడిపి కమిటీ నాయకులు, అనుబంధ కమిటీల నాయకులు, జిల్లా కమిటీ నాయకులు, అనుబంధ కమిటీల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అధికారంలోకి వస్తే డంపింగ్ యార్డును తరలిస్తాం



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డంపింగ్ యార్డు తరలిస్తామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి హామీ ఇచ్చారు. ఇటీవల డంపింగ్ యార్డు వద్ద అగ్నిప్రమాదం చోటు చేసుకుని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో ఆదివారం స్థానిక డంపింగ్ యార్డును మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ఎన్నికల ముందు మూడు నెలల్లో డంపింగ్ యార్డును తరలిస్తానని, ఆరునెలల్లో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తవుతున్నా ఇచ్చిన హామీల్లో ఏఒక్కటీ అమలు చేసిన పాపానపోలేదన్నారు. డంపింగ్ యార్డు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇటీవల డంపింగ్ యార్డు తగలపెట్టడంపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మారుతీకుమార్ గౌడ్, సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, సుధాకర్ యాదవ్, అజీజ్, పూల బాషా, సతీష్, తదితరులు పాల్గొన్నారు

వైద్యరంగానికి పెద్దపీట : ఎమ్మెల్యే వైవిఆర్



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బేతాపల్లి గ్రామంలో నాడు-నేడులో భాగంగా రూ.1.90 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకే పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలను సీఎం జగన్ నిర్మించారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానం, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సదుపాయాలు కల్పిస్తూ, వైద్య పరీక్షలు చేయడంలో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.విశాలాక్షి, పీఆర్ డిఇఇ డిఎల్ మురళీధర్, సర్పంచి చిన్న ఆంజనేయులు, ఎంపిడిఓ శ్రీనివాసులు, తహశీల్దార్ బి.భారతి, వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వైసిపి మండల ఇన్‌ఛార్జి బి.శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకుడు బేడల వెంకటరాముడు, కౌన్సిలర్లు వి.వరదరాజులు, వాల్మీకి శివ, నాయకులు సి.మల్లయ్య యాదవ్, వై.సుభాష్‌రెడ్డి,ఎ.సూర్యనారాయణ రెడ్డి, ఎ. దస్తగిరి, వెంకటేశ్వరరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, రామరంగారెడ్డి, లాలూనాయక్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలి

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, అఖిలభారత వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షులు దండిన శివానంద విజ్ఞప్తి చేశారు. 'ఇంటింటికి మన విశ్వన్న' కార్యక్రమంలో భాగంగా ఆదివారం విడపనకల్లు మండలంలోని పాల్తూరు గ్రామంలో పర్యటించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ త్వరలో రానున్న ఎన్నికల్లో తనతోపాటు సిఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు తాత్కాలిక ప్రలోభాలకు లొంగి మోసపోవద్దన్నారు. చిన్న పొరపాటు చేసినా ఐదేళ్లు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. 2019 ఎన్నికల తర్వాత పత్తా లేకుండా పోయిన టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కు ఇప్పుడు ప్రజలు గుర్తుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. కరోనా సమయంలో ఈ నాయకులు ఎక్కడున్నారని,ఇప్పుడే ప్రజలు గుర్తుకొచ్చారా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటువేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, నాయకులు బసన్న, భరత్‌రెడ్డి, కరణం భీమిరెడ్డి, బ్యూలారాణి, రాజశేఖర్, లెజెండ్ రామాంజనేయులు, రఘురాములు, ఉమాశంకర్, రామాంజనేయులురెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, వెంకటేష్, శివ, తిమ్మరాజు, డిష్ వెంకటేష్, నల్ల సుంకన్న, షణ్ముఖగౌడ్, రాముడు, మాలాపురం రామాంజనేయులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని ప్రతిబింబించేదే సాహిత్యం

ప్రముఖ దిగంబర కవి నగ్నముని



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

సమాజాన్ని ప్రతిబింబించేదే ఉత్తమ సాహిత్యం అని ప్రముఖ దిగంబర కవి నగ్నముని అభిప్రాయపడ్డారు. జిల్లా రచయితల సంఘం, స్పందన అనంత కవుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో డా.శాంతి నారాయణ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ సమావేశ మందిరంలో మువ్వా శ్రీనివాసరావు కవితాంతరంగ విశ్లేషణల సంపుటి 'అనితరుడు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ భూమికగా ఎదిగి వచ్చిన మువ్వా శ్రీనివాసరావు ఖమ్మంకు చెందిన అనితరమైన కవి అని కొనియాడారు. కవిని సమాజమే నిర్మించుకుంటుందని, ప్రపంచాన్ని హృదయంలోకి ముంచి రంగులద్దిన సృజనాత్మకతే మువ్వా శ్రీనివాసరావు కవిత్వమన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణస్వామి, వేణు గోపాల్‌రెడ్డి సత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి జయచంద్ర, తూముచర్ల రాజారామ్, వక్తలు సిద్ధగిరి శ్రీనివాస్, కె.లక్ష్మీనారాయణ, జి.ర.సం అధ్యక్షుడు జెన్నే ఆనంద్, ప్రధాన కార్యదర్శి సురేష్, బత్తల అశోక్‌కుమార్, ఎ.ఎ.నాగేంద్ర, కంబదూరు షేక్ నబీరసూల్, సాహితీవేత్తలు జెట్టి జైరాం, ఉప్పరపాటి వెంకటేశులు, గోవిందరాజులు, గుడిపల్లి విద్యావతి, గోసల నారాయణస్వామి, వన్నప్ప, చెగువేర హరి, వలస రమేష్, శీర్పి చంద్రశేఖర్, పలువురు కవులు పాల్గొన్నారు.

శాశ్వత పనులతోనే చిరకాల గుర్తింపు : 'కాలవ'



మాట్లాడుతున్న కాలువ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

చిరకాలం గుర్తుంచుకునేలా శాశ్వత పనులు చేయడంతోనే దివంగత మాజీ ఎమ్మెల్యే పాటిల్ వేణుగోపాల్‌రెడ్డికి చిరకాల గుర్తింపు లభించిందని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు కొనియాడారు. ఆదివారం మండల పరిధిలోని పల్లేపల్లి గ్రామంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గం పట్టణానికి తుంగభద్ర జలాలు తీసుకొచ్చి దాహార్తిని తీర్చిన గొప్ప వ్యక్తి పాటిల్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక శ్రీశైలం నుంచి భైరవానితిప్ప ప్రాజెక్టుకు నీటిని తీసుకొస్తామన్నారు. బిటిపి నుంచి ఎత్తిపోతల ద్వారా రాయదుర్గం మండలంలోని మల్లాపురం చెరువును నింపుతామన్నారు. తద్వారా పరిసర ప్రాంతాల పలు గ్రామాల రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పల్లేపల్లి రహదారిని వేయాలని, అభివృద్ధి పనులను చేయాలని పాటిల్ సదాశివరెడ్డి సూచించారు. అజయ్ పాటిల్ మాట్లాడుతూ గత సర్పంచి ఎన్నికల్లో తాము బలపరిచిన అభ్యర్థిని గెలిపించి, గ్రామాన్ని పసుపుమయం చేశారన్నారు. గ్రామస్తులకు రుణపడి ఉంటామన్నారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా గ్రామస్తులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం, డి.హీరేహాళ్ మండల కన్వీనర్లు హనుమంతు, హనుమంతురెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య



రామాంజనేయులు (పాతచిత్రం)

పుట్లూరు : మానసిక ఆరోగ్యం బాగోలేక బావిలో పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని గరుగుచింతలపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గరుగుచింతలపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు (44) మానసిక ఆరోగ్యం బాగోలేకపోవడంతో అప్పుడప్పుడు ఊరి విడిచి వెళ్లేవాడు. ఇందులో భాగంగానే ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఈనేపథ్యంలో బావిలో శవమై తేలాడు. అటుగా వెళ్లిన గొర్రెల వ్యాపారి బావిలోకి చూడగా శవం కనిపించడంతో గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని బయటకు తీయగా రామాంజనేయులు మృతదేహంగా గుర్తించారు. తండ్రి రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

నీటమునిగి విద్యార్థి మృతి



మృతిచెందిన సాయిచరణ్

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నఅహోలంలో సమీపంలో నీట మునిగి విద్యార్థి మృతిచెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... పెన్నఅహోబిలం సమీపంలోని పెన్నానది వద్ద ఏటి గంగమ్మ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఉరవకొండకు చెందిన రమేష్ కుటుంబంతో కలిసి పుణ్యస్నానాలు చేయడానికి వచ్చారు. ఇందులో భాగంగా ఇంటర్ చదువుతున్న సాయిచరణ్ (17) స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు గాలించగా అక్కడే ప్రాంతంలో ఉన్న సాయిచరణ్‌ను గుర్తించి బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చేతికొచ్చిన కొడుక్కి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా మృతిచెందిన విద్యార్థి గుంతకల్లు నారాయణ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్నాడు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. వ్యక్తికి గాయాలు

పుట్లూరు : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన ఆదివారం మండల పరిధిలోని చింతకుంట గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల సమాచారం మేరకు.. మడ్డిపల్లెకు చెందిన రామకృష్ణారెడ్డి పుట్లూరు నుంచి మడ్డిపల్లెకు వెళ్తుండగా, మరో మోటారు సైకిల్ తోటలో నుంచి ఉన్నట్టుండి రోడ్డుపైకి రావడంతో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రామకృష్ణారెడ్డి కింద పడ్డారు. తీవ్ర గాయాలపాలైన బాధితుడిని వెంటనే 108 ద్వారా తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కర్నాటక మద్యం స్వాధీనం

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. చంద్రబాబు కాలనీలో రమేస్ కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతోపాటు 30 ఐవార్డ్స్ విస్కీ, టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

పామిడి : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆయూష్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు మాట్లాడుతూ కంటి చూపు బాగుంటేనే అందరూ వారి పనులను విజయవంతంగా చేసుకుంటారన్నారు. ఇందుకోసం పేదలందరికీ కంటి పరీక్షలు నిర్వహించాలన్న ఉద్దేశంతోనే కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం 132 మందికి పరీక్షలు నిర్వహించి 95 మందికి ఆపరేషన్లు అవసరమని భావించి బెంగళూరు కంటి ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో మానవహక్కుల సంఘం దక్షిణ భారతదేశ సెక్రటరీ ఆవుల ప్రసాద్, శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వనిత, డాక్టర్ షారుఖ్, జయరామ్‌రావు, షేక్షావలి, రఘువీర్, రోషన్ జమీర్, గంగ శేఖర్, కిరణ్, సుహాన్, పత్రా శ్రీనివాసులు, ముండే సేక్షావలి,సురేష్,శంకర ఆసుపత్రి ఆర్గనైజర్ శివకుమార్, లక్ష్మీ ఆసుపత్రి సిబ్బంది, శంకర కంటి ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదానశిబిరం

నార్పల : టిడిపి జిల్లా నాయకులు, వెంకట్ వకుళా ఫౌండేషన్ ఛైర్మన్ ఆలం వెంకట నరసానాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని ఆలం క్యాంప్ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు టిడిపి నాయకులు చంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని అన్నిసర్వేల ప్రకారం ప్రతి మూడు సెకెండ్లకు ప్రపంచంలో ఎవరికైనా రక్త మార్పిడి అవసరం అవుతోందన్నారు. రోడ్డు ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, అవయవ మార్పిడి, వంటి వాటికి చాలా పెద్ద పరిమాణంలో రక్తం అవసరమవుతుందన్నారు. కావున ఆసక్తి ఉన్న వారు రక్తదానికి ముందుకు రావాలని కోరారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని భంభం స్వామి ఆశ్రమం సమీపంలో 18 కుటుంబాలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. ప్రజలకు సంక్షేమ పాలనా అందించడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కావున ప్రజలు రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు.

రైతులను ప్రోత్సహించడానికే రాతిదూలం పోటీలు



రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

గార్లదిన్నె : రైతులను ప్రోత్సహించడానికే రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. మండలంలోని కల్లూరు గ్రామం వద్ద పెన్నానది సమీపంలో వెలసిన క్షేత్రపాల కొండ శింగరప్ప స్వామి తిరుణాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రాతిదూలం లాగుడు పోటీలను నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎం.వీరాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను ప్రోత్సహించడానికి గ్రామీణ ప్రాంతాల్లో ఎద్దుల రాతిదూలం పోటీలను నిర్వహించడం సంతోషకరమన్నారు. గతంలో కల్లూరు నుంచి కొండపై కొలువైన సింగరప్ప స్వామిని దర్శించుకోవడానికి భక్తులు రోడ్డు మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి నూతనంగా తారురోడ్డు నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ రంగయ్యకు మద్దతుగా ప్రచారం

పామిడి : కళ్యాణదుర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ తలారి రంగయ్యకు మద్దతుగా పామిడి వాసులు ఆదివారం కళ్యాణదుర్గంలో ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా పామిడికి చెందిన భావసార క్షత్రియ సోదరులు కళ్యాణదుర్గానికి చేరుకుని ఆయనకు మద్దతుగా వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కొండా శేఖర్, జవల్కర్ రవికుమార్, అంబా భవానీ ఆలయ కమిటీ అధ్యక్షులు జవల్కర్ ముకుందరావు, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ అడ్వకేట్ దత్తు రావు, ఖమిత్కర్ వెంకటేశ్వరరావు, పామిడి పట్టణ వైఎస్ఆర్సిపి కన్వీనర్ జోజో డే కుమార్, జవల్కర్ బద్రీనాథ్, ఖమితకర్, తమ్మన్నారావు పాల్గొన్నారు.